జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 21-5-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 345 పేజీలు: 4 వెల : రూ.7



# కొండను మింగేస్తున్న
# కొండ చిలువలు!


* టీడీపీకి చెందిన ఓ మండల నేత కనుసన్నల్లోనే క్వారీలో తవ్వకాలు
* తక్కువ సెంట్లలో ప్రభుత్వం దగ్గర లీజు
* కొండ మొత్తాన్ని తవ్వేస్తున్న వైనం
* రాత్రి వేళలో పెద్ద పెద్ద బ్లాస్టింగ్‌లు
* జేసీబీలతో తవ్వకాలు
* ఎవరైనా ఇదేంటని ప్రశ్నిస్తే అంతుచూస్తామని బెదిరింపులు
* బ్లాస్టింగ్ వల్ల సమీప గ్రామంలోని ఇళ్లకు బీటలు
* ఫిర్యాదులు ఎన్ని చేసిన పట్టించుకోని రెవెన్యూ, గనుల శాఖ అధికారులు



**కొత్తూరు/శ్రీకాకుళం, మే 20 (వార్త):** శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలంలోని సోమరాజపురం గ్రామ పంచాయతీలో కోట్ల విలువైన గ్రావెల్, కంకరను అక్రమంగా తవ్వేస్తూ.. ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారు. ఈ తవ్వకాల వల్ల ఒకప్పుడు ఇక్కడ కొండ ఒకటి ఉండేదని అక్కడ గ్రామ ప్రజలు చెప్పుకోవల్సిన పరిస్థితి నేడు వచ్చింది. ఈ కొండను సదరు క్వారీ యాజమాన్యం అతి తక్కువ సెంట్లను ప్రభుత్వం దగ్గర లీజుకు తీసుకుని, నేడు కొండ మొత్తాన్ని ఆక్రమించి తవ్వకాలు చేస్తున్నారు. నిబంధనలు అతిక్రమించి బ్లాస్టింగ్ చేసి కొండ మొత్తాన్ని తవ్వేస్తున్నారు. ఈ కొండలో రాత్రి పూట బ్లాస్టింగ్లు చేయడం, జేసీబీలతో తవ్వకాలు చేస్తున్నారు. బ్లాస్టింగ్ వల్ల వల్ల వస్తున్న ఆ శబ్దాలకు ఆ పక్కనున్న గ్రామస్తులు బయాందోళనకు

... మిగతా 4లో

# లిక్కర్ మాఫియా కేసులో.. తొమ్మిది మందికి విముక్తి



* జిల్లాలో 2012లో వెలుగుచూసిన లిక్కర్ సిండికేట్
* సిండికేట్‌తో కలిసిపోయారని ఎక్సైజ్ అధికారులపై ఆరోపణలు
* నిందితులపై చర్యలు రద్దు చేసిన ప్రభుత్వం
* నిర్ణయంపై తీవ్ర విమర్శలు

**శ్రీకాకుళం, మే 20 (వార్త):** 2012లో వెలుగుచూసిన లిక్కర్ సిండికేట్ కేసులో జిల్లాకు చెందిన పలువురు ఎక్సైజ్ అధికారులు ఆరోపణల కింద విచారణకు గురయ్యారు. అక్రమంగా మద్యం సరఫరాకు వీరు సహకరించినట్టు, అక్రమ ఆర్థిక లావాదేవీలలో పాలుపంచుకున్నట్టు అప్పట్లో ఏసీబీ నివేదికలు పేర్కొన్నాయి.

### ఆరోపణలు ఎదుర్కొన్న ఎక్సైజ్ అధికారులు వీరే:

సి.హెచ్ తిరుపతి నాయుడు (ఇన్‌స్పెక్టర్, రణస్థలం), ఎం. సత్యనారాయణ (అసిస్టెంట్ కమిషనర్, శ్రీకాకుళం), టి. శ్రీనివాసరావు (సూపరింటెండెంట్, శ్రీకాకుళం), కె. బాలరామకృష్ణ (సూపరింటెండెంట్, శ్రీకాకుళం), ఎస్.వి.వి.ఎన్. బాబ్జి రావు (సూపరింటెండెంట్, శ్రీకాకుళం), పీ. పాపారావు (ఇన్‌స్పెక్టర్, కోటబొమ్మాళి), ఎస్. వెంకట రమణ మూర్తి (సబ్ ఇన్‌స్పెక్టర్, శ్రీకాకుళం), బి. వరాహ నాగభూషణ రావు (సబ్ ఇన్‌స్పెక్టర్, పలాస), ఈ. కృష్ణ (సబ్ ఇన్‌స్పెక్టర్, రణస్థలం), చె. మురళి బాబు (హెడ్ కానిస్టేబుల్, శ్రీకాకుళం), ఎస్. గౌరు నాయుడు (హెడ్ కానిస్టేబుల్, శ్రీకాకుళం), జి. పాపారావు (అసిస్టెంట్ మేనేజర్, ఐఎంఎల్ డిపో, ఎచ్చెర్ల)లపై 2012లో ఏసీబీ క్రిమినల్ కుట్ర, అవినీతి ఆరోపణలతో కేసులు నమోదు చేసింది. ఈ వివాదంపై తొలుత ట్రైబ్యునల్ ఫర్ డిసిప్లినరీ ప్రొసీడింగ్స్ (టీడీపీ) విచారణ చేపట్టింది. కానీ 2022లో టి.డి.పి. చట్టాన్ని రద్దు చేసిన ప్రభుత్వానికి కేసును కమిషనరేట్ ఆఫ్ ఇన్క్వయిరీస్‌కు బదలాయించి, ఆ విచారణ ఆధారంగా చాలామందిపై నిర్దోషిగా తేల్చి చర్యలను రద్దు చేసింది. ప్రభుత్వం తాజా జీవో (ఆర్.టి. నం. 442, తేదీ: 19-05-2025) ప్రకారం, మొత్తం 9 మంది అధికారులపై చర్యలు రద్దయ్యాయి. విచారణలో వారు నిర్దోషులని తేలిందని పేర్కొంది.

### వివాదం..

ఈ చర్యలపై పలువురు విశ్లేషకులు, సామాజిక కార్యకర్తలు విమర్శలు గుప్పిస్తున్నారు. భారీ లిక్కర్ స్కామ్‌లో విచారణ తీరుపై ప్రజలకు స్పష్టత లేదు. అందులో పాలుపంచుకున్నవారిపై ఈ విధంగా చర్యలు నిలిపివేయడంలో రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయన్న అనుమానాలు తలెత్తుతున్నాయని వారు చెబుతున్నారు.

### తలెత్తుతున్న ప్రశ్నలు..

నిజంగా ఈ విచారణ పూర్తి పారదర్శకంగా జరిగిందా? ఏసీబీ రూపొందించిన ఆధారాలు ఎందుకు చెల్లవని తేలాయి? పదవీ విరమణ చేసిన అధికారులపై చర్యలు ఎందుకు ఆలస్యం అయ్యాయి? రాజకీయ అండ ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారా? వంటి ప్రశ్నలకు సమాధానాలు లేవు.

## వెల్నెస్ సెంటర్లపై ఆకతాయిల దాడి

**సంతబొమ్మాళి, మే 20(వార్త):** సంతబొమ్మాళిలోని రెండు వెల్నెస్ సెంటర్లపై ఆకతాయిలు సోమవారం అర్ధరాత్రి దాడి చేసి కిటికీ అద్దాలను పగలగొట్టారు. కిటికీ అద్దాలు పగలగొట్టడంతో గదులు గాజు పెంకులతో నిండిపోయాయి. దీంతో సిబ్బంది ఇబ్బందులను ఎదుర్కొంటూ గదులను శుభ్రపరిచారు. అలాగే మందుబాబులు మందు తాగి సీసాలు అక్కడే వదిలేయడం, పగలగొట్టడం, మల మూత్ర విసర్జన చేయడం వంటి పనులు నిత్యం చేయడంతో సిబ్బంది ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీనిపై స్థానిక సర్పంచ్ కు చెప్పిన ఫలితం లేకుండా పోయిందని అన్నారు. దీంతో కిటికీ అద్దాలు పగలడంపై సంతబొమ్మాళి పోలీస్ స్టేషన్కు ఫిర్యాదు చేశామని సిబ్బంది తెలిపారు.



# సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు

**-మైనింగ్‌పై ఎప్పటికప్పుడు తనిఖీలు జరపాలి**

**-జిల్లా అభివృద్ధిపై సమగ్ర సమీక్షలో కలెక్టర్**

**శ్రీకాకుళం, మే 20(వార్త):** ఐవీఆర్ఎస్ ద్వారా ప్రభుత్వం నుంచి ప్రజలకు నేరుగా ఫోన్ కాల్స్ వస్తున్నాయి. ప్రభుత్వ సేవలపై ప్రజలు ఇచ్చే సమాధానం ప్రాతినిధ్యం కలిగి ఉంటుంది. అందుకే ప్రతి శాఖ బాధ్యతతో స్పందించాలి," అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా అభివృద్ధిపై ఆయన జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తో కలసి విస్తృత సమీక్ష జరిపారు.



ఈ సందర్భంగా పీజీఆర్ఎస్, ఎన్ఆర్ఈజీఎస్, రెవెన్యూ, ఆరోగ్య శాఖలతోపాటు మైనింగ్, పీఎం సూర్య ఘర్, ప్రధానంగా రీ సర్వే, కోర్టు కేసులు, అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లపై చర్చించారు. మండల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

### 343 ఫిర్యాదులు గడువు మించాయి

జిల్లాలో ఇప్పటివరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా 61,048 ప్రజా ఫిర్యాదులు నమోదుకాగా, వాటిలో 343 ఫిర్యాదులు గడువు మించాయని కలెక్టర్ పేర్కొన్నారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ శాఖల్లో పెండింగ్ సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు.

### ఉపాధి పనుల్లో అసమానతలు

మండలాలవారీగా పనుల పురోగతిలో తేడాలు కనిపిస్తున్నాయని, కొన్ని మండలాల్లో 90 శాతం పనులు పూర్తవుతుండగా మరికొన్నింటిలో 50 శాతం కూడా చేరలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. రానున్నది వర్షాకాలం కాబట్టి వెంటనే నీటిపారుదల శాఖకు సంబంధించిన పనులను డ్వామా అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు.

### రెవెన్యూ అంశాలపై..

22(ఎ) రికార్డుల స్వచ్ఛీకరణ, వివిధ శాఖలతో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల స్థితిగతులు, ముఖ్యంగా వంశధార నదిపై హై లెవల్ బ్రిడ్జి నువ్వలరేవు-మచిలీపేట రహదారి నిర్మాణాలకు సంబంధించిన అడ్డంకులపై చర్చించారు. నువ్వలరేవు ప్రజలు ఎక్కువ పరిహారం కోరుతుండటంతో, పలాస ఆర్డీఓ, వజ్రపుకొత్తూరు తహసీల్దార్, శ్రీకాకుళం ఎస్.ఇ (ఆర్అండ్‌బీ) సంయుక్త సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. అంతేకాకుండా, లావేరు, ఎచ్చెర్ల మండలాల్లో యూనివర్సిటీ స్థాపనకు 30-40 ఎకరాలు, హైడ్రో కార్బన్ కంపెనీ స్థాపనకు 2000 ఎకరాల భూమిని గుర్తించాలని, అలాగే ఏపీఐఐసీ భూ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

### అక్రమ మైనింగ్‌పై ఆగ్రహం

అక్రమ ఇసుక రవాణా, నియంత్రణలేని గ్రానైట్ తవ్వకాలపై కలెక్టర్ స్పందించారు. అక్రమ మైనింగ్‌ను గుర్తించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. డివిజనల్ మైనింగ్ కార్యాలయం, జిల్లా మైనింగ్ కార్యాలయం మధ్య సమన్వయం మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. అవసరమైతే జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లాలోని అన్ని గ్రానైట్ క్వారీల తనిఖీలు నిర్వహించాలన్నారు. ఆరోగ్య, శానిటేషన్, పథకాలు కాలానుగుణ వ్యాధుల నివారణ, నీటి నమూనాల పరిశీలనపై వైద్య శాఖను ఆదేశించారు. పీఎం సూర్య ఘర్ పథకంలో బ్యాంకులు, కాంట్రాక్టర్ల వద్ద ఉన్న పెండింగ్‌లను తొలగించాలన్నారు. ఐసిడిఎస్ పథకంలో నిర్మాణాలను త్వరితగతను పూర్తి చేయాలి అన్నారు.

### యోగా దినోత్సవానికి సిద్ధంగా ఉండాలి

జూన్ 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ఆయుష్ శాఖ, అరసవల్లి ఎండోమెంట్ అధికారి సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమీక్షలో ఉప కలెక్టర్ పద్మావతి, డీఆర్వో వెంకటేశ్వరరావు, డీపీఓ భారతి సౌజన్య, సీపీవో ప్రసన్న లక్ష్మి, ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.




## నేడు మెగా జాబ్ మేళా

**-ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో..**

**-నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి**

**-ఎమ్మెల్యే ఎన్ఈఆర్**

**రణస్థలం, మే 20(వార్త):** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఉదయం 9 గంటలకు రణస్థలం ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రాంగణంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు, 21 ప్రైవేట్ కంపెనీలు పాల్గొంటున్న ఈ మేళాలో 835 ఖాళీలను భర్తీ చేయనున్నట్లు ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు గారు తెలిపారు. టీఏఓ డిజిటల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, దివిస్, ఎన్ఏసీఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఇసుజు మోటార్స్, డైకిన్ తదితర ప్రముఖ సంస్థలు మేళాలో పాల్గొనను న్నాయని చెప్పారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, బీఫార్మసీ చదివిన 18-30 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు.

## ప్రతి ఇంటికీ తాగునీటికి సర్వే ప్రారంభం



**పలాస, మే 20(వార్త):** ఉద్దానం ప్రాజెక్ట్ నుంచి, పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం నకు ఇటీవలే ప్రభుత్వం వారు కేటాయించిన 5 ఎంఎల్‌డి మంచి నీటిని జంట పట్టణాలలో అన్ని వార్డులకు, అన్ని వీధులలో కూడా సరఫరా చేసే విధంగా ప్రణాళికను రూపొందించడానికి పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. అన్ని సచివాలయం ఏమినిటీ కార్యదర్శులతోను, ప్లానింగ్ కార్యదర్శులతోను మంగళవారం సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శాసనసభ్యులు గౌతు శిరీష, చైర్ పర్సన్ బల్ల గిరిబాబు గారి ఆదేశానుసారం, జంట పట్టణాలలో అన్ని వార్డులకు మంచినీటి పైపులైన్లను, ఇంటింటికి మంచినీటి కుళాయిలను ఏర్పాటు చేయడానికి తగ్గ ప్రణాళికలను త్వరలోనే రూపొందించి, నిరంతరం మంచినీటిని దశలవారీగా ఇంటింటికి ఇవ్వటానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, అందుకోసం నేటి నుండి సచివాలయం ల వారీగా ప్రతి వీధు లలో ను, ప్రతి ఇంటిని సర్వే చేస్తున్నట్లు చెప్పారు. అందు కొరకు శాసనసభ్యులు గౌతు శిరీష ప్రతిరోజు వాటర్ సప్లై విషయమై వాకబు చేస్తున్నారని కమిషనర్ తెలియజేశారు.

## ఐదుగురికి ఏవోలుగా పదోన్నతి

**శ్రీకాకుళం, మే 20(వార్త):** జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ మంగళవారం ఐదుగురు సీనియర్ సహాయకులకు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లుగా పదోన్నతి కల్పిస్తూ, నియామకపు ఉత్తర్వులు అందజేశారు. సంతబొమ్మాళి మండల పరిషత్ సీనియర్ సహాయకుడు డి.నరసింగరావును అక్కడే అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా నియమించారు. హిరమండలం సీనియర్ సహాయకులు ఎన్.సోమశేఖర్‌ను పదోన్నతిపై అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా వంగరకు బదిలీ చేశారు. కొత్తూరు సీనియర్ సహాయకుడు ఎ.మార్కండేయరావును పదోన్నతిపై అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా రణస్థలంకు బదిలీ చేశారు. జడ్పీలో పనిచేస్తున్న సీనియర్ సహాయకుడు కె.ఉమామహేశ్వరరావు పదోన్నతిపై అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా శ్రీకాకుళంలో నియమించారు. ఎస్సీఎస్సీఎస్ లిమిటెడ్‌లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న జి.మధుసూదనరావును పదోన్నతిపై అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పొందూరుకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదోన్నతి పొందిన ఉద్యోగులు కష్టపడి పని చేసి జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్యానికి మంచి పేరు, ప్రతిష్టలు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీఈవో శ్రీధర్ రాజా, డిప్యూటీ సీఈవో డి.సత్యనారాయణ, సి.సెక్షన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రమేష్, సిసెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.



# తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల నిరసన




**శ్రీకాకుళం, మే 20(వార్త):** తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ లో పనిచేస్తున్న కెప్టెన్స్(డ్రైవర్లు) సిఐటియు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఒక్క రోజు సమ్మెలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ కెప్టెన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, దశరథ మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం ఇప్పించాలని, ఎపి తల్లిబిడ్డ ఎక్స్ ప్రెస్ ఎంప్లాయీస్ తల్లి బిడ్డ ఎక్స్ ప్రెస్ వాహనాలతో మారుమూల ప్రాంతాల్లో సమయంతో నిమిత్తం లేకుండా సేవలందిస్తున్నామని, మా సేవలను ప్రభుత్వాలు గుర్తించడంలో విఫలమవుతున్నాయని విమర్శించారు. అరబిందో యాజమాన్యం గత పది సంవత్సరాలుగా అతి తక్కువ వేతనం ఇస్తున్నాయని, ఆ వేతనంతో పెరిగిన నిత్యవసరాలతో జీవనం సాగించడం దుర్భలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం వాటా పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ ను యాజమాన్యమే చెల్లించాలని డిమాండ్ చేశారు. చట్టప్రకారం వీక్లి ఆఫ్, జాతీయ శలవులు అమలు చేయాలన్నారు. విధి నిర్వహణకు అవసరమైన సెల్ ఫోన్ ఇస్తూ, నెలవారీ రీచార్జ్ చేయాలని కోరారు. ప్రమాద భీమా, ఎక్స్ గ్రేషియా, ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. వాహనాలు మరమ్మతులు చేయాలని, రిపేర్లు కు అయ్యే సొమ్ముని ముందుగా చెల్లించాలని కోరారు. వాహనాల సంఖ్యను బట్టి అదనపు, బఫర్ సిబ్బందిని నియమించాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఈ నిరసనకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, సిఐటియు టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.రాజేశ్వరరావు, కె.కృష్ణంనాయుడు, ఎల్.రాంబాబు, పి.వెంకటరావు, ఎం.మణికంఠ, పి.అనంత్, ఎస్.రాజశేఖర్, బి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రుల ఆత్మ గౌరవం టీడీపీ ధ్యేయం

**పలాస, మే 20(వార్త):** ఆంధ్రుల ఆత్మగౌరవం కోసం టిడిపి స్థాపించారని,బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి నిరంతరం పనిచేసే పార్టీ తెలుగు దేశం పార్టీ అని మాజీ మంత్రి గౌతు శ్యాంసుందర్ శివాజీ అన్నారు. పలాస తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియో జకవర్గ మినీ మహానాడు కార్యక్రమంలో మాజీ మంత్రి శివాజీ ఆయన ముఖ్య అతిథిగా పాల్గొ న్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం ఒక సువర్ణ అక్షరాలతో గుర్తింపు పొందిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారి ఆత్మగౌరవం పెంచేవిధంగా పార్టీ పని చేస్తుం దన్నారు. తెలుగుదేశం పార్టీ ఎన్నో సంస్కరణలు, సంక్షేమ పథకాలు తీసుకువచ్చి ప్రజలకు మంచి పరిపాలన అందిస్తుందన్నారు. ఇది పేదల పార్టీ అని తెలిపారు. తెలుగుదేశంపార్టీలో కార్యకర్తలకు ఎప్పుడు సముచిత స్థానం ఉంటుందన్నారు. క్రియాశీలక సభ్యత్వాలు కోట్లలో ఉన్నాయని, కార్యకర్తకు అండగా రూ.5 లక్షల బీమా సౌకర్యం పార్టీ కల్పిస్తుందన్నారు. తెలుగుదేశం పార్టీలో తామంతా ఉండడం తమ అదృష్టమన్నారు. పహల్గాం మృతులు మరియు ఆపరేషన్ సిందూర అమర




జవనులుకు నివాలలు అర్పిస్తూ తీర్మానం. ముఖ్యమంత్రి నారా చంద్రదాబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, విద్యా శాఖామాత్యులు నారా లోకేష్, కేంద్ర విమానయాన శాఖ మంత్రివర్యులు, కె. రామ్మోహన్ నాయుడు, రాష్ట వ్యవసాయ శాఖా మంత్రివర్యులు అచ్చెన్నాయుడు, శాసనసభ్యురాలు గౌతు శిరీషని అభినదిస్తూ తీర్మానం చేశారు. సాగు-త్రాగునీటి వనరుల అభివృద్ధి పై తీర్మానం, జీడి-కొబ్బరి పంటలకు మద్దత్తు ధర కోరుతూ తీర్మానం, సుదూర సముద్ర తీరప్రాంతం పలాస నియోజకవర్గంలో మత్స్యకారుల సంక్షేమం, వారి అభివృద్ధి తో పాటు పర్యాటక కేంద్రాల అభివృద్ధి కై తీర్మానం, సమగ్ర గిరిజన అభివృద్ధి- ఐటీడీఏ ఏర్పాటు కొరకు తీర్మానాలు చేశారు. ప్రతిపాదిత ఎయిర్పోర్టు నిర్మాణానికి, నైపుణ్య శిక్షణా కేంద్రం ఏర్పాటు, పారిశ్రామికి పార్కు ఏర్పాటు కొరకు తీర్మాణం, విద్యా సౌకర్యాలను మరింత విస్తృత పరచడానికి అవసరమైన ప్రతిపాదను ఆమోదానికై తీర్మానం, వైద్య సౌకర్యాలను మరింత విస్తృత పరచడానికి అవసరమైన ప్రతిపాదను ఆమోదానికై రాజకీయ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చౌదరి బాబ్జి,నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## విజయవాడ - కర్నూలు - విజయవాడ
# నూతన విమాన సర్వీసులకు శ్రీకారం

**శ్రీకాకుళం, మే 20(వార్త):** విజయవాడ - కర్నూలు - విజయవాడ మధ్య జూలై 2వ తేదీ నుంచి నూతన ఇండిగో విమాన సర్వీసులు ప్రారంభించనున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు . ప్రతి సోమవారం, బుధవారం మరియు శుక్రవారం ఈ విమానాలు నడుపబోతున్నట్టు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అమరావతిని రాయలసీమ ముఖ ద్వారమైన కర్నూలును అనుసంధానం చేస్తూ ఈ కొత్త మార్గం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతీయ ప్రయాణ అవసరాలను తీర్చడమే కాకుండా, అంతర్ రాష్ట్ర విమాన కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా రూపొందించబడిదని, రాష్ట్ర ప్రజలకు విమాన ప్రయాణాన్ని మరింత అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యం అని వారు పేర్కొన్నారు. విద్య, వ్యాపారం, ప్రభుత్వ మరియు ఇతర అవసరాల నిమిత్తం ప్రాంతీయంగా ప్రయాణించే ప్రయాణికులకు ఇది ఎంతో ఉపయోగకరంగా మారుతుందన్నారు.



## ఎన్టీఆర్ జన్మదిన వేడుకల్లో ఎన్ఈఆర్

**లావేరు, మే 20(వార్త):** లావేరు మండలం వెంకటాపురం లో టీమ్ తారక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఎన్‌టీఆర్ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు ఏర్పాటు చేసిన బ్లడ్ డొనేషన్ క్యాంప్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగాఎమ్మెల్యే మాట్లాడుతూ హీరోల బర్త్ డే వేడుకలను సమాజానికి ఉపయోగ పడే కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందని, స్ఫూర్తి దాయకమైన పనులను చేయడం ద్వారా మంచి మెసేజ్ ఇస్తున్న అభిమానులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు లుకలాపు అప్పలనాయుడు, మీసాల త్రినాథ్ రావు, అప్పలరాజు, మూర్తి మరియు టీమ్ తారక్ ట్రస్ట్ సభ్యులు, అభిమానులు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూమిని ఇప్పించండి



**సంతబొమ్మాళి, మే 20(వార్త):** కాపుగోదాయ వలస గ్రామంలో సర్వేనెంబర్ 207-7 లో 22 సెంట్లు తన భూమిని ఇప్పించాలని రైతు సైన. ఆదినారాయణ కోరుతున్నారు. స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో మంగళవారం అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. వారసత్వంగా సంక్రమించిన ఆస్తిని గ్రామానికి చెందిన బన్నాడ.వీరస్వామి, సింహాచలం, వరహాలు, అంగ శంకర్ రావు, అంగ రాజారావు ఆక్రమించుకున్నారని అన్నారు. కోర్టు తనకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో తన భూమిని తన ఆధీనంలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నించగా ఆక్రమించుకున్న వ్యక్తులు దౌర్జన్యంగా తనపై దాడి చేసి, భూమి మీదకు వస్తే చంపేస్తా అంటూ బెదిరిస్తున్నారని ఆదినారాయణ వాపోయారు. దీనిపై జిల్లా కలెక్టర్కు , ఎస్పీకి ఫిర్యాదు చేశానని అన్నారు. నా భూమి నాకు రాకపోతే ఆత్మహత్య శరణ్యమని ఆదినారాయణ అంటున్నారు. దీనిపై అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు



**ఇచ్ఛాపురం, మే 20(వార్త):** జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఎల్ మార్క్స్ థియేటర్ వద్ద భారీ ఎత్తున అభిమానులతో వేడుకలు నిర్వహించారు. జూనియర్ ఎన్టీఆర్ ఫాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జన్నెల సంతోష్ యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జూనియర్ ఎన్టీఆర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాళ్ళ జైదేవ్.బుగత వినయ్. కేదారిపురం జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు. శివ తదితరులు పాల్గొన్నారు.

## కలమటను కలసిన అవినాష్

**కొత్తూరు, మే 20(వార్త):** మాతలలో గల క్యాంపు కార్యాలయంలో శ్రీకాకుళం పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు, పాతపట్నం మాజీ శాసనసభ్యులు కలమట వెంకటరమణ మూర్తి ని ఇటీవల నామినేటెడ్ పదవుల్లో భాగంగా డిసిఎంఎస్ చైర్మన్ గా నియమితులైన చౌదరి ఆవినాష్ మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా తెదేపా అధ్యక్షులు కలమట మాట్లాడుతు యువతకు పెద్దపీట వేస్తూ పార్టీ గౌరవించి అప్పచెప్పిన బాధ్యతలు విజవంతంగా నిర్వర్తించి చేపట్టిన పదవికి, పార్టీకి పేరు తెచ్చేలా పనిచేయాలని దిశనిర్దేశం చేసారు.



# మాటా.. మంతికి రావివలస ఎంపిక

**-ఫలించిన మంత్రి అచ్చెన్నాయుడు కృషి**

**-22న గ్రామస్థులతో వర్చువల్ విధానంలో మాట్లాడనున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**

**-టెంపుల్ టూరిజం, గ్రామాభివృద్ధికి చర్యలు**



**టెక్కలి, మే 20(వార్త):** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రాతినిధ్య వహిస్తున్న శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం పరిధిలోని రావివలస గ్రామాన్ని అభివృద్ధి చేయడంతో శ్రీశ్రీశ్రీ ఎండల మల్లికార్జున స్వామి ఆలయాన్ని టెంపుల్ టూరిజంగా అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం ఎంపిక చేసింది. గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు ప్రతిష్టాత్మకంగా ఈ నెల 22 న మాటా మంతి కార్యమాన్ని నిర్వహించనున్నారు.ఈ ఎంపికతో గ్రామ రూపురేఖలు మారనున్నాయి. మాటా...మంతీ కార్యక్రమానికి ఎంపిక ఈ గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభి వృద్ధి మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళిక రూపొందించనున్నారు. మాటా మంతి కార్యక్రమంలో భాగంగా ఎంపికైన ఈ గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయనున్నారు, అన్ని మౌలిక వసతులు కల్పించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల ఉండగా వీటిలో శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం రావివలస గ్రామాన్ని ఎంపిక చేయడం విశేషం.గ్రామంలో ఉన్న శ్రీ ఎండల మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధి టెంపుల్ టూరిజాన్ని అభివృద్ధి చేయనున్నారు అందుబాటులో భాగంగా 22 న ఉపముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో మాట్లాడనున్నారు. ఈ గ్రామాన్ని ఎంపిక చేయడం పట్ల గ్రామస్థులు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొనిదల పవన్ కళ్యాణ్, గౌరవ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.మాటా మంతి కార్యక్రమానికి ఎంపికైన సందర్భంగా గ్రామస్తులు, నాయకులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. బగాది శేషు, నాయుడు, హనుమంతు రామకృష్ణ, మామిడి రాము, మట్ట పురుషోత్తం, ధోని బుజ్జి, బడే జగదీశ్, ఇప్పిలి జగదీశ్ ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా తిరంగా యాత్ర



**కొత్తూరు, మే 20(వార్త):** ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన సందర్భంగా ఆర్మీ జవాన్లకు అభినందనలు తెలియజేస్తూ మాజీ సైనికులు మరియు బీజేపీ కొత్తూరు మండల అధ్యక్షులు బూరాడ భాస్కరరావు ఆధ్వర్యంలో కొత్తూరు మండల కేంద్రంలో తిరంగా యాత్ర ర్యాలీని మంగళవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ తిరంగా ర్యాలీలో భాగంగా కొత్తూరు మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల అంబేద్కర్ జంక్షన్ వద్ద బత్తిలి రోడ్ వైపు అలాగే అక్కడ నుండి కొత్తూరు పడాల వీధి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం వరకు అక్కడి నుండి అంబేద్కర్ కూడలి వరకు భారత్ మాతా కి జై, జై జవాన్ అనే స్లొగన్స్ తో ర్యాలీని చేపట్టారు. అనంతరం దేశం కోసం సేవ చేసి రిటైర్ మాజీ సైనికులుకు స్థానిక నాయకులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో కొత్తూరు మండల వైస్ ఎంపీపీ, టీడీపీ నాయకులు లోతుగడ్డ తులసీ వరప్రసాద రావు, బీజేపీ కొత్తూరు మండల అధ్యక్షులు బూరాడ భాస్కర్ రావు,మాజీ సైనికులు చోడవరపు నర్సింహామూర్తి,కోయిలాపు శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా కమిటీ సభ్యులు వలురౌతు ప్రసాదరావు, కొత్తూరు మండల వైస్సార్సీపీ అధ్యక్షులు గండివలస ఆనంద రావు, జనసేన మండల అధ్యక్షులు దొంపాక జయరాజు, కర్లెమ్మ మాజీ సర్పంచ్ పడాల వెంకట కృష్ణ, కోయిలాపు సంజీవరావు, గేదల ప్రసాద రావు, మాజీ సైనికులు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### పిడుగు పడి ఒకరి మృతిపై ...
## మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి

**శ్రీకాకుళం, మే 20(వార్త):** బలగ బుచ్చిపేటకు చెందిన గేదెల రాజారావు పిడుగు పడి మృతి చెందడంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర దిగ్భ్రాంతికి వ్యక్తం చేశారు. గాయాల పాలైన ఆయన కుమారుడు నాగర్జునకు మెరుగైన వైద్యం అందించాలని రిమ్స్ వైద్యులను ఆదేశింశారు. రామారావు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

రానున్న రెండు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. ఉరుములు, మెరుపులుతో పిడుగులు పడే అవకాశం ఉందని, ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావద్దని కోరారు.

# లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి




**పలాస, మే 20(వార్త):** లేబర్ కోడ్ లు రద్దు చేయాలని చేపట్టాల్సిన అఖిల భారత సమ్మె జులై 9కి వాయిదా వేసిన నేపథ్యంలో దేశ వ్యాప్తంగా కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా నిరసనలకు మంగళవారం పిలుపు నిచ్చాయి. ఈ పిలుపులో భాగంగా కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద కార్మిక, రైతు సంఘాలు నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా ఏ పి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె మోహనరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్ గణపతి, ఏ ఐ సి సి టి యు జిల్లా నాయకులు కె దుశ్యంత్ లు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక, రైతు, ప్రజా వ్యతిరేఖ విధానాలను ప్రభుత్వాలు విడనాడాలని డిమాండ్ చేశారు. కార్మిక, ప్రజా సమస్యలు పట్ల ప్రభుత్వం ఆలోచించాలని డిమాండ్ చేశారు.దేశాన్ని కార్పొరేట్లకు అమ్మేసి, ప్రజలను మోసగిస్తే చూస్తూ వూరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ టి అజయ్ కుమార్, జీడి రైతులు టి రాజు, సురేష్, కాష్యూ లేబర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు శిస్టు గోపి, అంబటి ఆనంద్, ఏ ఐ సి సి టి యు నాయకులు కె లోకనాదం, పి నాగేశ్వరావు, ఏ పి రైతు సంఘం నాయకులు కె హేమసూదన్, కె బాలాజీ, డి కామేసు సిపిఎం కార్యకర్తలు ఎన్ ఢిల్లేశ్వరి, కె సుహాసిని, ఆటో యూనియన్ నాయకులు యస్ కె బషీర్, కార్మికులు పాల్గొన్నారు.

**కొత్తూరు, మే 20(వార్త):** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జూలై 9 కి వాయిదా పడిన నేపథ్యంలో దేశవ్యాప్త కార్మిక, కర్షక సంఘాలు చేపడుతున్న నిరసనలలో భాగంగా మంగళవారం కొత్తూరు మండలకేంద్రం నాలుగు రోడ్ల జంక్షన్లో సిఐటియు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ నిరసన కార్యక్రమాన్ని మంగళవారం నాడు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు పనస రమేష్, పి.కృష్ణలు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి మూడవ సారి అధికారం చేపట్టిన తర్వాత కార్మిక చట్టాలన్నింటిని రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లు తీసుకొస్తున్నారు, లేబర్ కోడ్స్ అమలు చేస్తే కనీసం కార్మికులు తమ సమస్యలపై నిరసన కూడా తెలియజేసే అవకాశం కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే కనీస వేతనాలు అమలు కాక, ఉద్యోగ భద్రత లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వీరి సమస్యలపై వారు నిరసన తెలుపుకునే అవకాశం కూడా భవిష్యత్తులో కోల్పోతారని ఇది ఒకరకంగా దేశంలో నిరంకుశ విధానాలను అవలంబించడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జూలై 9న సమ్మె చేపట్టనున్నట్టు తెలిపారు. నూతన రోడ్డు రవాణా చట్టం రద్దు చేయాలని, ముఠా కార్మికులకి సమగ్ర చట్టం చేయాలని,ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కనీసవేతనం నెలకు 26,000 ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్, రమేష్, ఆనంద్, రామకృష్ణ, వెంకటరమణ, వినోద్, అప్పలరాజు, కార్మికులు పాల్గొన్నారు.



## శ్రీకాకుళం



# మైనర్ బాలికపై లైంగిక దాడి

*** నిందితుడిని కాపాడేందుకు రాజీయత్నం చేసిన కొందరు పెద్దమనుషులు * హిరమండలం పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితురాలి కుటుంబీకులు * పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు**

**శ్రీకాకుళం క్రైం, మే 20 (వార్త):** హిరమండలం మండలానికి చెందిన ఓ మైనర్ బాలికపై ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాలిక కుటుంబీకులు హిరమండలం పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. అయితే గ్రామంలోని కొందరు పెద్దలు నిందితుడిని కాపాడేందుకు రాజీ చేసేందుకు యత్నించినట్టు సమాచారం. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్టు హిరమండలం ఎస్ఐ మహమ్మద్ యాసిన్ తెలిపారు. సమగ్ర దర్యాప్తు చేస్తున్నామన్నారు.



# పిడుగుల.. వర్షం

*** జిల్లావ్యాప్తంగా వర్షాలు * లోతట్టు ప్రాంతాలు జలమయం * సిక్కోలులో రోడ్డుపైకి మురుగునీరు * భయపెట్టిన ఉరుములు, మెరుపులు *పిడుగుపాటుకు తండ్రి మృతి, కుమారుడికి గాయాలు * ప్రగాఢ సంతాపం తెలిపిన మంత్రి అచ్చెన్నాయుడు**

**శ్రీకాకుళం, మే 20(వార్త):** శ్రీకాకుళం జిల్లావ్యాప్తంగా మంగళవారం ఉరుములు, పిడుగులతో వర్షం కురిసింది. శ్రీకాకుళం నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయ మయ్యాయి. కాలువలు పూడుకుపోవడంతో మురుగునీరు రోడ్డెక్కింది. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు నానాఇబ్బందులు పడ్డారు. శ్రీకాకుళం నగరంలోని బలగ బుచ్చిపేటకు చెందిన గేదెల రాజారావు, అతని కుమారుడు నాగార్జున నాగావళి నదికి మంగళవారం ఉదయం వెళ్లారు. అక్కడ పిడుగు పడడంతో రాజారావుతో పాటు నాగార్జున గాయాల పాలయ్యారు. రాజారావును రిమ్స్‌కు తరలిస్తుండగా, మార్గమధ్యలోనే మృతి చెందాడు. నాగార్జున చికిత్స పొందుతున్నాడు. రాజారావు తాపీమేస్త్రీ కాగా, నాగార్జున కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. భద్రమ్మ తల్లి వారాల పండుగను చేసుకున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకోవడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. గేదెల






రాజారావు మృతి పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయాలపాలైన నాగార్జునకు మెరుగైన వైద్యం అందించాలని రిమ్స్ వైద్యులను ఆదేశించారు. రానున్న రెండు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉరుములు, మెరుపులుతో పిడుగులు పడే అవకాశం ఉందని, ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావద్దని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు.



## కొండను మింగేస్తున్న...

# కొండ చిలువలు


**(మొదటిపేజీ తరువాయి)**

గురవుతున్నారు. వారి నివాసాలు కూడా చాలావరకు బీటలు వారాయి. కొండ రాయి ఓవర్ లోడ్ ట్రిప్పర్‌లతో ఆర్.కె.పురం వీధి రోడ్లపై వెళు తుండటంతో పూర్తిగా రోడ్లు పాడైపోతున్నాయి. బ్లాస్టింగ్ వల్ల రాళ్ల ముక్కలు సమీప గ్రామాల్లో పడుతున్నాయి. ఈ విషయమై పలుమార్లు సమీప గ్రామస్థులు రెవెన్యూ, మైన్స్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అయినా ఏ ఒక్కరూ స్పందించలేదు. సమావేశాల్లో ఆయా గ్రామాల ప్రజలు ఈ సమస్యను ప్రస్తావించినా, ప్రశ్నించినా.. టీడీపీ మండల పార్టీ నాయకుడు ఒకరు బెదిరింపులకు పాల్పడుతున్నారు. కేసులు పెడతామని, అంతుచూస్తామని ఎదురుదాడికి దిగుతుండడంతో ఆయా గ్రామస్థులు చెబుతున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో గ్రామానికి వచ్చిన నాయకుల దగ్గర విన్నవించుకుంటే మేము గెలిచిన వెంటనే ఈ క్వారీని ఆపిస్తామన్న నాయకులు ఈ రోజు వరకు కనిపించకుండా పోయారని గ్రామ ప్రజలు మండిపడుతున్నారు. అయితే మొన్న మెళియాపుట్టిలో క్వారీలో జరిగిన సంఘటన వల్లనేమో అధికారులలో కొంచం చలనం వచ్చి మదనాపురంలోని క్వారీకి వచ్చి తూతూ మంత్రంగా పరిశీలించి క్వారీలో ఎటువంటి పేలుడు జరిగిన తక్షణం చర్యలు తీసుకుంటామని చెప్పి ఆ క్వారీ యాజమాన్యం చెప్పేది విని వెళ్లిపోయారన్న విమర్శలు ఉన్నాయి. అయితే టీడీపీ నేత అయితే తన వెనుక నియోజకవర్గానికి చెందిన బడా నేత ఉన్నారని, తననేం చేయలేరని బహిరంగంగానే చెబుతున్నాడు.

**(ఈ క్వారీ నిర్వహణ వెనుక ఎవరెవరు ఉన్నారు.. సూత్రధారులు ఎవరు? పాత్రధారులు ఎవరు? అనేది త్వరలో 'జాతీయ వార్త'లో సమగ్ర కథనంలో తెలుసుకుందాం)**







మహారాజశ్రీ గౌరవనీయులు శ్రీకాకుళం జిల్లా కలక్టర్ వారి దివ్యసముఖమునకు
కొత్తూరు మండలం, మదనాపురం పంచాయితీ, రామక్రిష్ణాపురం గ్రామ కాపురస్తులు ఈ క్రింద సంతక నిషానీదారులు అనేక సమస్కారములు చేసి వ్రాసుకున్న ఫిర్యాదు విన్నపములు.

విషయం :రామక్రిష్ణాపురం గ్రామానికి ఆనుకొని ఉన్న సాయిదుర్గా స్టోన్ క్రషర్ లైసెన్స్ రద్దు చేయుట గూర్చి.


అయ్యా !

కొత్తూరు మండలం, సోమరాజపురం పంచాయితీ, ఆర్.కె. పురం దగ్గరలో సాయిదుర్గా స్టోన్ క్రషర్ ... సదరు క్వారీ ప్రభుత్వం వద్ద అతి తక్కువ సెంట్లు లీజుకు తీసుకొని నిబంధనలను అతిక్రమించి కొండ మొత్తం ...నం చేసుకొని బ్లాస్టింగ్ జరుపుతున్నాడు. ఇందువలన ఆ శబ్దములకు ఇంటి గోడలు పగులుచున్నవి. ఆర్.కె.పురంలో ...ందు ఇళ్లు నిరుపేదవారివి పడిపోయినవి. ఓవర్ లోడ్ వలన ఆర్.కె.పురం వీధి రోడ్డు పాడైపోతున్నది. బ్లాస్టింగ్ ... రాళ్ల ముక్కలు తుల్లి గ్రామంలో పడుచున్నవి. మనుషులకు, పశువులకు రాళ్ల దెబ్బలు తగులుతున్నవి. రాళ్ల ...లు రోడ్డుపై పడుతున్నందువలన ద్విచక్ర వాహనాలు వెళ్లుటకు, మనుషులు నడుచుటకు అనేక ఇబ్బందులు ...చున్నవి. వాహనాల టైర్లు పడిపోవుచున్నవి. రాత్రిళ్లు శబ్దమునకు ప్రజలకు నిద్రలు లేవు. మరియు గ్రామానికి ...కొని ఉన్నందువలన స్టోన్ క్రషర్ దుమ్ము వలన కాలుష్యం ఏర్పడి అనారోగ్యములకు గురిఅగుచున్నాము.

గాన విచారణ జరిపించి క్వారీ రద్దు చేయవలసినదిగానూ, గ్రామ ప్రజలకు న్యాయం చేయవలసినదిగానూ ...వి చేయుచున్నాము.

చిత్తగించవలెను
ఇట్లు
ఆర్.కె.పురం గ్రామ ప్రజలు







Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546